

ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శనివారం భక్తుల సంఖ్య భారీగా తగ్గింది.

-8లో



డ్వాక్రా సంఘాల పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

డ్వాక్రా సంఘాల నిర్వహణపై వివిధ హోదాల్లో అధికారులు పనిచేస్తున్నా.. సంఘాల్లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
32.8/25.6

వాతావరణం

జిల్లాలో శనివారం 25.6 – 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్‌

న్యూస్‌రీల్‌

ఏఎఫ్‌యూలో రేపు కౌన్సెలింగ్‌

కడప ఎడ్యుకేషన్‌: డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయంలో 25న బీఎఫ్‌ఏ (ఫోర్‌ ఇయర్స్‌ డిగ్రీ) ఫైన్‌ ఆర్ట్స్‌ (యానిమేషన్‌, అప్లైడ్‌ ఆర్ట్‌, పెయింటింగ్‌, ఫొటోగ్రఫీ, శిల్పం, బి. డెస్‌ ఇంటీరియర్‌ డిజైన్‌) కోర్సులకు కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు వీసీ విశ్వనాథ్‌కుమార్‌ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం www.ysrafu.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

ఇన్‌స్టంట్‌ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వైవీయూ వీసీ తదితరులు

కడప ఎడ్యుకేషన్‌: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల ఇన్‌స్టంట్‌ పరీక్షల ఫలితాలను శనివారం వైవీయూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలసి మాట్లాడారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్‌ ఆఫ్‌ ఒకేషనల్‌ ఐదు సెమిస్టర్ల పరీక్షలకు1,012 మంది విద్యార్థులు హాజరు కాగా 977 మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. పీజీ కోర్సులలో ప్రవేశాలకు అనువుగా ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvuexams.in/resu lts.aspx అనే వెబ్సైట్‌ను సందర్శించాలని ఆచార్య కృష్ణారావు సూచించారు. ఈ కార్య క్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధి కారి డాక్టర్‌ గణేష్‌ నాయక్‌ పాల్గొన్నారు.

ఎరువుల ధరల కట్టడికి చర్యలు

కడప అగ్రికల్చర్‌: జిల్లాలో ఎరువులు, యూరియా అధిక ధరలు అరికట్టడంతోపాటు ఎరువుల బ్లాక్‌ మార్కెట్‌కు అడ్డుకోవడానికి వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయశాఖ అధికారితోపాటు పోలీసు, విజిలెన్స్‌ డిపార్టమెంట్‌కు చెందిన అధికారులతో కలిసి టీమ్‌లను ఎంపిక చేసింది. ఈ టీమ్‌లలో వ్యవసాయ డివిజన్‌ వారిగా ఆయా డివిజన్‌ ఏడీలతోపాటు పోలీసు సర్కిల్‌ ఇన్‌స్పెక్టరు, విజిలెన్స్‌ డిపార్టుమెంట్‌కు సంబంధించి ఒక అధికారితో కలిసి టీమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎనిమిది వ్యవసాయ డివిజన్లకు 8 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్స్‌ కలిపి జిల్లా వ్యాప్తంగా ఆయా ఆయా వ్యవసాయ డివిజన్ల పరిధిలో ఎరువులను అధిక ధరలకు అమ్మినా, ఎరువులను బ్లాక్‌ మార్కెట్‌కు తరలించినా చర్యలు తీసుకోనున్నారు.

ఎరువులను బ్లాక్‌ మార్కెటింగ్‌ చేస్తే ...

కడప అర్బన్‌: 'యూరియా ఎరువును దాచిపెట్టడం (హోర్డింగ్‌) , బ్లాక్‌ మార్కెటింగ్‌'ను నివారించేందుకు ప్రత్యేక దాడులు చేయనున్నట్లు విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కడప రీజనల్‌ అధికారి ఏ. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. యూరియాను దారి మళ్లించడం, అక్రమంగా నిల్వ చేయడం లేదా బ్లాక్‌ మార్కెటింగ్‌ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బ్లాక్‌ మార్కెట్‌ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ రాబందులు!



నంద్యాలంపేట సర్వే నంబర్‌ 854/1, సర్వే నంబర్‌ 840లో ప్రభుత్వ భూమి చదును చేసిన టీడీపీ నేతలు



- ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు స్వాహా చేస్తున్న పచ్చ నేతలు
- నంద్యాలంపేట పొలం వైపు కన్నెత్తి చూడని రెవెన్యూ యంత్రాంగం
- రద్దు చేసిన భూమిని సైతం చెరబట్టిన వైనం

సాక్షి ప్రతినిధి, కడప: మైదుకూరు నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు అక్రమార్కుల అవతారమెత్తారు. చెరువులు, వాగులు, పోరంబోకు ప్రభుత్వ భూములను చెరబట్టారు. అధికార పార్టీ ఎమ్మెల్యే పేరు చెబుతూ అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారు. జాండ్లవరం గ్రామానికి చెందిన తెలుగుతమ్ముళ్లు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు. నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనంబర్‌ 859లో 16 ఎకరాలు, సర్వే నంబర్‌ 840లో 70 ఎకరాల భూమికి కంచె వేశారు. తాజాగా సర్వే నంబర్‌ 854/1లో 1.61 ఎకరాలు అస్సెస్డ్‌ వేస్ట్‌ ల్యాండ్‌ (ఏడబ్ల్యూ) చదును చేశారు. దాని సమీపంలోని సర్వే నంబర్‌ 840లో ఉన్న మరింత భూమిని కలుపుకొని సుమారు నాలుగెకరాలు, ప్రభుత్వం స్వాధీన అనుభవంలో భూమిని తాజాగా డోజర్లతో చదును చేసి తెలుగుతమ్ముళ్లు వశపర్చుకుంటున్నారు. నేషనల్‌ హైవే రహదారి పక్కలో ఉన్న ఆ పొలం ఎకరం రూ.50 లక్షలకు తక్కువ లేకుండా పలుకుతోంది. అలాంటి భూమి అన్యాక్రాంతమవుతున్నా, రెవిన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

పట్టా రద్దు భూమి సైతం..

2022లో డీకేటీ పట్టా రద్దు చేసిన భూమిని 2024లో ప్రభుత్వ ఏడబ్ల్యూ ల్యాండ్‌గా గుర్తించారు. 2025లో అదే భూమి తెలుగుతమ్ముళ్ల వశమైంది. ఎకరం రూ.50లక్షలు చేసే ప్రభుత్వ భూమి ఆన్యాక్రాంతమైంది. సర్వే నంబర్‌ 854/1లో 1.61 ఎకరాలు బొడికే లక్ష్మీదేవి పేరిట డీకేటీ పట్టా నెం.294/1414, జనవరి 20, 2005న జారీ అయ్యింది. పట్టాదారు పాసుపుస్తకం కూడా మంజూరైంది. ఆ భూమిలో తాము పంట పెట్టలేని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని డీకేటీ పట్టా రద్దు చేయాల్సిందిగా అప్పటి తహసీల్దార్‌ ప్రేమంత్‌కుమార్‌కు బొడికే లక్ష్మీదేవి అర్జీ పెట్టుకున్నారు. ఆ మేరకు 2022 జనవరి 25న డీకేటీ పట్టా రద్దు చేస్తూ తహశీల్దారు ఉత్తర్వులు జారీ చేశారు. అదే భూమిని 2024 జనవరి 11న ఏడబ్ల్యూ ల్యాండ్‌గా గుర్తిస్తూ అప్పటీ తహసీల్దార్‌ అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ భూమిగా సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. కూటమి సర్కార్‌ వచ్చిన తర్వాత అదే భూమి తెలుగుతమ్ముళ్లు వశమైంది. తాజాగా జాండ్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఒకరు స్వాధీనం చేసుకొని చదును చేస్తున్నారు.

» ఇంటి పట్టాల కోసం ఇచ్చిన భూమి సైతం...

నంద్యాలంపేట రెవెన్యూ పొలంలో భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. జగనన్న కాలనీ కోసం సర్వే నంబర్‌ 859లో 16 ఎకరాలు నిర్ణయించారు. ఎకరం రూ.20 లక్షలు విలువ చేసే ఈ స్థలాన్ని పేదలకు ఇండ్ల స్థలాల కోసం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. వ్యక్తిగత కేటాయింపులు కూడా చేశారు. ఈ తరుణంలో కొంతమంది కోర్టును ఆశ్రయించి, ఆభూమిలో పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం వ్యవహారం కోర్టులో ఉండగా జాండ్లవరం గ్రామానికి చెందిన తెలుగుతమ్ముళ్లు ఆ భూమిని చదును చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే సర్వే నంబర్‌ 840లో 70 ఎకరాలు బ్రహ్మంసాగర్‌ నిర్వాసితుల కోసం కేటాయించారు. ఆ భూమికి ఏకంగా ఫెన్సింగ్‌ వేశారు. ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్‌ వేస్తున్నారని గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది ప్రశ్నిస్తే వారిపై నోటి దురుసుతనం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయి రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదులున్నా, నోరు మెదపలేదు. కోట్లాది రూపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా కనీస స్పందన లేదు. చట్టం తెలుగుతమ్ముళ్ల చుట్టం కావడమే అందుకు ప్రధాన కారణంగా పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

చట్టం తెలుగుతమ్ముళ్లకు చుట్టమైంది. అధికారమే పెట్టుబడిగా యథేచ్ఛగా భూ ఆక్రమణలు చేయడం పరిపాటిగా మారింది. ఖాళీ భూమి కన్పిస్తే చాలు కంచె వేయడం.. స్వాహా చేయడం షరామామూలైంది. ఫలితంగా విలువైన భూములు అధికారపార్టీ నేతల గుప్పిట్లో చేరి నలిగిపోతున్నాయి. మైదుకూరు మండలంలో ఈ తంతు అధికంగా నడుస్తోంది. 'ఎమ్మెల్యే మా వాడే, ప్రభుత్వం మాదే'నంటూ పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూమికి సైతం ఫెన్సింగ్‌ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, పండితులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో ఆగస్టు 24 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి మేదిని పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఘట్టాలు నిర్వహించారు. యాత్రికుల వల్ల, సిబ్బంది వల్ల తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడురోజులపాటు పవిత్రోత్సవాలు జరుపుతుంటారు. పవిత్రోత్సవాలలో భాగంగా ఆగస్టు 24న యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయానాధివాసం, 25న పవిత్ర సమర్పణ, 26న వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్‌ హనుమంతయ్య, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ నవీన్‌, అర్చకులు పాల్గొన్నారు.

నమో నారసింహ

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అభిషేకాలు, అర్చనలు జరిపారు. తోమాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో అర్చనలు, అభిషే కాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అమానుషం



ప్రజల సమస్యలపై అధికారులకు ఫోన్‌ చేస్తున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి



ములాఖత్‌ అనంతరం సబ్‌జైలు నుంచి బయటకు వస్తున్న ఎంపీ

కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలోని దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించడం అమానుషమని కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని భాకరాపురంలో ఉన్న వైఎస్‌ జగన్‌ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా 4లక్షల పింఛన్లను తొలగించిందన్నారు. అదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులు చెబుతోందన్నారు. చంద్రబాబు నాయుడు దివ్యాంగులతో కూడా రాజకీయాలు చేయడం నీచమైన చర్యగా అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 66 లక్షలకుపైగా పింఛన్లు అందజేసేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం 62లక్షల పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. అలాగే ఈ ప్రభుత్వంలో రైతన్నలకు ఎరువులు కూడా లభించడంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన యూరియా కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అధికార పార్టీ నాయకులు పక్కదారికి మళ్లిస్తున్నారన్నారు. సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు చేశామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అరకొరగా సంక్షేమ పథకాలు అందజేసి అన్ని పథకాలు అమలు చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎల్లో మీడియా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్‌ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ

గత జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ రమేష్‌ యాదవ్‌, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రాములపై టీడీపీ గూండాలు అమానుషంగా దాడి చేసిన విషయం విదితమే. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు, అటెంప్ట్‌ మర్డర్‌ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులైన మనోహర్‌, గుండాలయ్య, చంద్రబాబు, మునిచంద్ర, ఎస్‌.గంగిరెడ్డి, అంకాల్‌రెడ్డి, గోపాల్‌, క్రిష్టిపాటి గంగిరెడ్డిలను శనివారం ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి ములాఖత్‌ ద్వారా సబ్‌జైలులో కలిశారు. ఈ సందర్భంగా వారిని ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

వక్ఫ్‌ భూముల లీజుకు వేలం



కడప సెవెన్‌రోడ్స్‌: జిల్లాలోని ఏపీ స్టేట్‌ వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన కొన్ని భూములను ఒక ఏడాదిపాటు గుత్తకు సాగు చేసుకోవడానికి వేలం పాట నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. కలెక్టరేట్‌ ఆవరణలోని డి.బ్లాక్‌లో ఉన్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనదలిచిన వారు వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్‌, కడప పేరిట రూ. 10 వేల బయాన చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలంలో సాగుభూములు దక్కించుకున్న వారు వెంటనే గుత్త మొత్తం చెల్లించి తగిన రశీదు పొందాలన్నారు. ప్రొద్దుటూరు మండలం మోడెంపల్లె మసీదుకు సంబంధించిన తాళ్లమాపురం గ్రామం, అలాగే అదే గ్రామంలోని అసూర్‌ఖానాకు చెందిన భూములను ఈనెల 26వ తేది మధ్యాహ్నం 2 గంటలకు వేలం వేస్తారన్నారు. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె, ముద్దురెడ్డిపల్లె మసీదు, అసూర్‌ఖానాలకు సంబంధించిన భూములు అదేరోజు వేలం వేస్తామన్నారు. పులివెందుల మండలం పోల్లేపల్లె గ్రామానికి చెందిన అసూర్‌ఖానా భూములు, ఖాజీపేట మండలం తుడుములపల్లె గ్రామ సర్వే నెంబర్లలోని అసూర్‌ఖానా భూములకు వేలం పాట నిర్వహిస్తామని వివరించారు.

● ఆంధ్రకేసరి.. మన్నించాలి మరి!



కూటమి నేతల మాటకు.. చేతలకు పొంతనే ఉండదు. ప్రచార ఆర్భాటాలు మినహా ఆచరణలో చేసేదేమీ ఉండదు. ఇదిగో కడప నగరం ఏడురోడ్ల కూడలిలోని మన ప్రకాశం పంతులుగారి నిలువెత్తు విగ్రహమే ఇందుకు సాక్ష్యం. స్వాతంత్ర్య సంగ్రామంలో తన సర్వస్వాన్ని ధార పోసిన మహోన్నత నాయకుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆయన జయంతిని కూటమి ప్రభుత్వం అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని గొప్పలు చెప్పింది. ఆచరణలోకి వచ్చేసరికి చేతులు దులిపేసుకుంది. సమయం లేదో.. ఉత్సవంగా చేయాలన్న మనసే రాలేదోగానీ అటు అధికారులు.. ఇటు నాయకులు జయంతి వేళ ఒక్క దండ కూడా వేసింది లేదు. పాత పూల దండతోనే దర్శనం ఇస్తున్న విగ్రహాన్ని చూసిన స్థానికులు 'మన్నించు.. పంతులు గారూ' అంటూ మౌనంగా వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప

సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి

- డీఎస్సీ మెరిట్‌ జాబితా విడుదల
- కడపలో ఒకే కుటుంబంలో ముగ్గురికి ఉపాధ్యాయ ఉద్యోగాలు



కడప ఎడ్యుకేషన్‌: డీఎస్సీ -2025లో అర్హత సాధించిన ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమైంది. ర్యాంకు సాధించిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత లాగిన్‌ ఐడీల ద్వారా కాల్‌లెటర్లు అందుతాయని ఇదివరకే అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్‌ ద్వారా కాల్‌లెటర్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుని తమకు సంబంధించిన ఒరిజినల్‌ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల తీసుకున్న కులధ్రువీకరణ పత్రం, గెజిటెడ్‌ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల సర్టిఫికెట్‌ జిరాక్స్‌లు, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని వారికి కేటాయించిన తేదీల్లో సర్టిపికెట్ల వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. వెరిఫికేషన్‌కు హాజరుకాకముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేయా ల్సి ఉంటుంది, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌కు తప్పనిసరిగా హాజరు కావాలి. అలా హాజరు కాని లేదా అర్హత లేని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుందని అధికారులు స్పష్టం చేశారు.



ఎస్వీ ఇంజనీరింగ్‌ కళాశాల

ఎస్వీ ఇంజనీరింగ్‌ కళాశాల పరిశీలన కేంద్రంగా ఎంపిక...

డీఎస్సీ అభ్యర్థులకు త్వరలో జరగబోయే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ కోసం విద్యాశాఖ కడప బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్‌ కళాశాలను ఎంపిక చేసింది. సర్టిఫికెట్ల పరిశీలన కోసం విద్యాశాఖ, రెవెన్యూశాఖ అధికారులను 68 మందితో 17 టీముల సిద్ధం చేశారు. వీరితోపాటు 30 మంది వలంటీర్లను కూడా అందుబాటులో ఉంచారు.

» ఒకే ఇంట్లో ముగ్గురికి టీచర్‌ కొలువులు



సనావుల్లా

కృషి, పట్టుదలతోపాటు ప్రణాళిక ఉంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదని కడప నగరానికి చెందిన ఒక కుటుంబం నిరూపించింది. ఒకరా ఇద్దరా ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి టీచర్‌ ఉద్యోగాలకు ఎంపికై భళా అనిపించారు. ఇందులో భార్యభర్తలతో పాటు ఆడబిడ్డ ఉండడం విశేషం. సనావుల్లా స్కూల్‌ అసిస్టెంట్‌ ఫిజిక్స్‌లో జిల్లా ఫస్ట్‌ ర్యాంకు సాధించాడు. అలాగే అతని భార్య నజీహా కరీమ్‌ 84.07 మార్కులతో ఉర్దూ విభాగంలో జిల్లా ఫస్ట్‌ ర్యాంకు సాధించగా.. సనావుల్లా చెల్లెలు సయ్యద్‌ రేష్మా ఉర్దూ ఎస్‌జీటీ విభాగంలో 20వ ర్యాంకు సాధించడం విశేషం.

» పల్లె నుంచి ఫస్ట్‌ ర్యాంకు వరకు..



భాగ్యలక్ష్మి

ఓ మారుమూల పల్లెలో నివాసం.. పైగా గృహిణి.. ఇద్దరు పిల్లలు. అలాగని ఆమె అక్కడితో ఆగిపోలేదు. తన ఇద్దరు పిల్లల పోషణ చూసుకుంటూనే ఆన్‌లైన్‌లో కోచింగ్‌ తీసుకున్నారు. ప్రస్తుత డీఎస్సీ సోషియల్‌ సబ్జెక్టులో జిల్లా ఫస్ట్‌ ర్యాంకు సాధించింది. ఆమే దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామానికి చెందిన అప్పల్‌రెడ్డి భాగ్యలక్ష్మి. ఇంటి వద్దే ఉంటూ ఆన్‌లైన్‌ కోచింగ్‌ తీసుకుని కష్టపడి చదివి జిల్లా ఫస్ట్‌ ర్యాంకు సాధించడంపై ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. బాగ్యలక్ష్మి భర్త సునీల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఫిజికల్‌ డైరెక్టర్లుగా ఎంపిక

జమ్మలమడుగు: ఎర్రగుంట్ల జిల్లా పరిషత్‌లో చదువుకున్న నలుగురు విద్యార్థులు ఫిజికల్‌ డైరెక్టర్లుగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయుల రెడ్డి పేర్కొన్నారు. సెలెక్టు అయిన వారిలో చంద్రకాంత్‌ మూడవర్యాంకు, తాజుద్దీన్‌ 20వ ర్యాంకు, ఆరిఫ్‌ మహమ్మద్‌ 25, జగదీష్‌కుమార్‌ 56 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

గణిత విభాగంలో ర్యాంకు సాధించిన లక్ష్మీదేవి



సింహాద్రిపురం: డీఎస్సీ పరీక్షా ఫలితాలలో సింహాద్రిపురం మండలం బి.చెర్లోపల్లె గ్రామానికి చెందిన పసుపులేటి లక్ష్మీదేవి డీఎస్సీ గణితం స్కూలు అసిస్టెంట్‌ విభాగంలో అనంతపురం జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. ఈ డీఎస్సీ పరీక్షకు అనంతపురం జిల్లాలో దాదాపు 2వేల మందికిపైగా హాజరు కాగా, అందులో లక్ష్మీదేవికి అనంతపురం జిల్లాస్థాయిలో 3వ ర్యాంక్‌ సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ముద్దనూరు : ముద్దనూరు–ఎర్రగుంట్ల ప్రధాన రహదారి పక్కనే సుమారు రూ.10 లక్షల విలువచేసే పరిశ్రమకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగలను చోరీ చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే వున్న ఓ స్టోన్ క్రషర్ మిషన్‌లోని 250 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగలను శుక్రవారం రాత్రి సమయంలో చోరీ చేసినట్లు సమాచారం. ఏకంగా పరిశ్రమకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌నే ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యార్థి ఆత్మహత్య


భానుప్రకాష్ (ఫైల్)

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెలుగు భానుప్రకాష్ (22) అనే విద్యార్థి నంద్యాల జిల్లా పాణ్యం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం విద్యార్థి కళాశాల హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భానుప్రకాష్ తల్లిదండ్రులు రాంభూపాల్, సరస్వతి హుటాహుటిన ఆర్‌జీఎం కళాశాల వద్దకు వెళ్లారు. అప్పటికే కళాశాల యాజమాన్యం, పోలీసులు భానుప్రకాష్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భానుప్రకాష్ శుక్రవారం ఆయన తండ్రికి తనకు ఆరోగ్యం బాగా లేదని, ఆత్మహత్య చేసుకుంటున్నానని మెసేజ్ పెట్టాడని పోలీసులు తెలిపారు. దీనిపై భానుప్రకాష్ తండ్రి తాను మెసేజ్ చూసుకోలేదని, తనకు అంతటి చదువు రాదని కళాశాల యాజమాన్యం తన కుమారుడిని ఏమో చేసిందని విద్యార్థి తల్లిదండ్రులతోపాటు, బంధువులు ఆసుపత్రి వద్ద బోరున విలపించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై కొలుములపల్లి సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద శనివారం తెల్లవారుజామున కారును గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ ప్రాంతానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వారు తిరుమల దర్శనం కోసం వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ నిర్లక్ష్యంగా నడిపిన కారణంగా ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా పారిపోయినట్లు సమాచారం.

డ్వాక్రా సంఘాల పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

- లక్షల రూపాయల డబ్బులు స్వాహా చేసినట్లు ఆరోపణలు
- ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వెలుగు చూస్తున్న పర్యవేక్షణ లోపాలు



ప్రొద్దుటూరు : డ్వాక్రా సంఘాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను నియమించింది. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు వివిధ హోదాల్లో అధికారులు పనిచేస్తున్నారు. వేతనాలతో పాటు కమీషన్లను దండుకుంటున్నారు. అయినా తరచూ డ్వాక్రా సంఘాల నిర్వహణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తద్వారా డ్వాక్రా సభ్యులు నష్టపోతున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి మెప్మా పరిధిలో 2814 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి ప్రతి నెల వేతనాలు తీసుకునే ఆర్పీలు, సీఓలతోపాటు మున్సిపాలిటీకి సంబంధించి ప్రత్యేక అధికారి ఉన్నారు. ప్రభుత్వాలు చాలా ఏళ్లుగా డ్వాక్రా సంఘాలకు సంబంధించి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. వివిధ రకాలుగా సహాయ సహకారాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల రుణమాఫీ (వైఎస్సార్ ఆసరా), రుణాల వడ్డీ మాఫీ పథకాన్ని అమలు చేశారు.

ఇలా చేయాలి..

ప్రతి నెలా కింది స్థాయిలో ప్రతి డ్వాక్రా గ్రూప్‌కు సంబంధించి ఆర్పీ ఆధ్వర్యంలో సభ్యుల సమావేశాన్ని నిర్వహించాలి. గత నెలలో జరిగిన వివరాలను చర్చించడంతోపాటు బ్యాంకులకు డబ్బు జమ చేసిన రశీదులను తీర్మానంలో పొందుపరచాలి. ఆర్పీతోపాటు గ్రూప్ లీడర్లు, సభ్యులు తీర్మానంలో సంతకాలు చేయాలి. ప్రతినెలా ఆర్పీ పది మంది సభ్యులను హాజరుపరిచి పొదుపు, అప్పు, వడ్డీ వివరాలను వివరించాలి. ప్రతినెలా ఒక్కో సభ్యురాలు బ్యాంక్‌కు వెళ్లి కంతుల డబ్బును చెల్లించాలి. చెల్లించిన రశీదులను మరుసటి నెలలో నిర్వహించే సమావేశం తీర్మానం పేజీలో అతికించాలి. తీర్మానంలోనే గ్రూప్ సభ్యులు ఇప్పటి వరకు ఎంత డబ్బు చెల్లించారు అనే వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇంత పకడ్బందీగా ఆర్పీ గ్రూప్‌లను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి నెలా ఆర్పీలకు సంబంధించి ఎస్‌ఎల్‌ఎఫ్ సమావేశాన్ని సీఓ నిర్వహిస్తారు. ఈ సమావేశానికి ప్రతి గ్రూపు నుంచి ఒక లీడర్, ఒక సభ్యురాలు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే కింది స్థాయిలోనే పర్యవేక్షణ గాడి తప్పిందనేదానికి ఉదాహరణ ఇది.

పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన నూరె షబా డ్వాక్రా గ్రూప్‌కు సంబంధించి వెలుగు చూసిన సంఘటన. లక్షల రూపాయలను లీడర్లు స్వాహా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎంత అనే విషయం అలా ఉంచితే డ్వాక్రా సంఘాల్లో ఈ సమస్య హాట్ టాపిక్‌గా మారింది. గత సోమవారం బ్యాంక్ అధికారులు, మెప్మా అధికారులు శ్రీనివాసనగర్‌లోని డ్వాక్రా గ్రూప్ లీడర్ల ఇళ్ల వద్దకు వెళ్లగా వారు ఇంటికి తాళాలు వేసిన విషయాన్ని గుర్తించారు. తర్వాత లీడర్ల కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడారు. ఏడాదిగా డ్వాక్రా సభ్యులకు సంబంధించిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఏడాది కాలంగా డబ్బు దుర్వినియోగం అయి ఉంటే ఎందుకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఆర్పీ ప్రతినెలా సభ్యులతో సమావేశం నిర్వహించి యాప్‌లో ఫొటోతోపాటు గ్రూప్ సభ్యుల తీర్మానం పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సక్రమంగా కంతులు చెల్లించకపోతే బ్యాంక్ అధికారులు ఇంత కాలం ఎందుకు చర్యలు తీసుకోలేదు. పైగా ప్రతి ఏడాది ప్రతి గ్రూప్‌కు సంబంధించి అధికారులు ఆడిట్ చేయిస్తున్నారు. గత ఏడాది ఆడిట్‌లో ఈ విషయాలు వెలుగు చూడలేదా, అసలు ఆడిట్ చేయించలేదా అనే ప్రశ్న తలెత్తుతోంది.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

నూరె షబా స్వశక్తి సంఘంలో జరిగిన అవకతవకలపై సభ్యులు నాలుగు రోజుల క్రితం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఆర్పీలు ఎందుకు పట్టించుకోవడం లేదు

డ్వాక్రా సంఘాల నిర్వహణ గురించి మున్సిపాలిటీలో కొంత మంది ఆర్పీలు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రతినెల డ్వాక్రా గ్రూప్‌కు సంబంధించి పుస్తకాలు రాసేందుకు కొంత మంది ఆర్పీలు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. అలాగే బ్యాంక్ లోన్ ఇప్పించిన సందర్భాల్లో 5 శాతం చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. ఇవే కాకుండా గ్రూప్ సభ్యులను ఆసరాగా చేసుకుని సొంత వ్యాపారాలు చేస్తున్నారు. నూరె షబా స్వశక్తి సంఘంపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మెప్మా టీఈ మహాలక్ష్మిని వివరణ కోరగా సోమవారం గ్రూప్ లీడర్ల ఇళ్ల వద్దకు వెళ్లిన మాట వాస్తవమేనన్నారు. ఎంత డబ్బు వాడుకున్నారనే విషయంపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. గ్రూప్ లీడర్లను వివరణ కోరగా తమ గ్రూప్‌కు సంబంధించిన తీర్మానం బుక్‌లతోపాటు బ్యాంక్ పాస్ పుస్తకాలు ఆర్పీ దగ్గరే ఉన్నాయని తెలిపారు. నాలుగు రోజుల క్రితం పాస్ పుస్తకాలను తమకు ఇచ్చారన్నారు. ప్రతి విషయాన్ని తాము ఆర్పీకి ఎప్పటికప్పుడు తెలియజేశామని పేర్కొన్నారు. స్థానిక అధికారులను కాకుండా ప్రత్యేక అధికారులచేత విచారణ చేయిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

టీటీడీ ఛైర్మన్ పదవికి బీఆర్ నాయుడు అనర్హుడు

– వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి



కడప కార్పొరేషన్ : తిరుమల, తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవికి బీఆర్ నాయుడు అనర్హుడని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదివరకు వైవీ సుబ్బారెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఆదికేశవులు నాయుడు, భూమన కరుణాకర్‌రెడ్డిలాంటి వారు టీటీడీ ఛైర్మన్లుగా ఉండి పార్టీలకతీతంగా దైవభక్తితో సేవ చేశారన్నారు. ప్రస్తుత ఛైర్మన్ బీఆర్ నాయుడు రాజకీయాలు మాట్లాడుతూ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డిలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆయన ఛైర్మన్‌గా ఎంపికైన నాటి నుంచి ఏదీ కలిసి రావడం లేదని, కల్తీ లడ్డు వ్యవహారం దేశాన్ని కుదిపేసిందని, టికెట్ల విక్రయాల్లో గోల్‌మాల్, దర్శనం సమయంలో తోపులాటలో ఆరుగురు భక్తులు చనిపోయారని, అన్నప్రసాదాల్లో జెర్రి రావడం, గోవులకు సరైన వైద్యం, ఆహారం అందించకుండా 191 గోవులు చనిపోవడానికి కారణమయ్యారన్నారు. ఈ వరుస సంఘటనల వల్ల ఏం చేయాలో దిక్కుతెలియక వైఎస్ జగన్‌కు దైవభక్తి లేదని, భారతీరెడ్డి తలనీలాలు సమర్పించాలని మాట్లాడుతున్నారన్నారు. లోకేష్ సతీమణి, నారా భువనేశ్వరి ఏమైనా తలనీలాలు సమర్పించారా అని ప్రశ్నించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షేక్ షఫీ పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకంటే అధికంగా అమ్మితే చర్యలు

ప్రొద్దుటూరు : ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువ ధరకు యూరియా అమ్మితే వ్యవసాయ శాఖ తీసుకునే చర్యలకు వ్యాపారులు సిద్ధంగా ఉండాలని, దుకాణాల వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. ఆయన శనివారం ప్రొద్దుటూరులోని పలు ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూరియా బస్తా రూ.266.50 చొప్పున మాత్రమే అమ్మాలని తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. యూరియా నిల్వలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా వ్యవసాయ శాఖ, పోలీసులతో కలసి విజిలెన్స్ మానిటరింగ్ టీంను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, సీఐ వేణుగోపాల్, డీసీటీఓ ఖాజామొహిద్దీన్, ఏఓ వరహరికుమార్ పాల్గొన్నారు.


దుకాణంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్, ఏడీఏ అనిత

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

మైదుకూరు : మైదుకూరులోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డుల్లో తేడాలు ఉండటంతో పలు దుకాణాల యాజమానులకు నోటీసులిచ్చారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్, శ్రీసాయి లక్ష్మీ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో రికార్డులను, ఎరువుల ధరలు ఎమ్మార్పీ ముద్రణ విషయాలను పరిశీలించారు. స్టాక్ రికార్డుల్లో తేడాలు ఉండటంతో దుకాణ యాజమానులకు అమ్మకాలను నిలిపేస్తూ నోటీసులిచ్చారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణంలో రూ.53,385 విలువైన 9.41 టన్నుల యూరియా, శ్రీసాయి లక్ష్మీ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.53,300 విలువైన 10 టన్నుల యూరియాను అమ్మకూడదని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

పెద్ద దర్గాకు ఉత్సవ శోభ

నేటి నుంచి ఉరుసు

కడప సెవెన్‌రోడ్స్ : భక్తుల పాలిట కొంగుబంగారమై నిలుస్తూ ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక సూఫీ పుణ్య క్షేత్రమైన కడప పెద్దదర్గాకు ఉరుసు శోభ చేకూరింది. ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు దర్గా 10వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్తి ఉల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధోత్సవం, సోమవారం ఉరుసు, మంగళవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు. ఉరుసురోజు ఖవ్వాలీ కచేరీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దర్గాతోపాటు దర్గా ఆవరణం విద్యుద్దీపాలతో కాంతులీనుతూ భక్తులను ప్రత్యేకంగా ఆకర్శిస్తోంది.


విద్యుద్దీప అలంకరణలో కడప పెద్దదర్గా

గండి అంజన్నకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజలు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామిని శ్రావణ మాసం చివరి శనివారం సాయంత్రం కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ ఫలంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీబాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రామాంజులరెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు రుషి కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ నరసింహులు, శేషారెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


గండి వీరాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఆ ముగ్గురిపై తదుపరి చర్యలకు ప్రతిపాదించాం

– జిల్లా సబ్ జైళ్ల అధికారి ఎస్. అమర్‌బాషా

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : 'ఆ ముగ్గురికి మాత్రం ఛార్జి మెమోలా' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు సంబంధించి జిల్లా సబ్ జైళ్ల అధికారి ఎస్. అమర్‌బాషా ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. రిమాండ్ ఖైదీ పరారీ విషయంలో సిబ్బందిపై చర్యలు తీసుకున్నాము. ఈ ఘటనపై సమగ్ర నివేదికతో పాటు అవసరమైన తదుపరి చర్యల ప్రతిపాదనలు ఇప్పటికే ప్రధాన కార్యాలయానికి పరిశీలన, తగిన ఆదేశాల కోసం సమర్పించామని పేర్కొన్నారు.

గండి క్షేత్రంలో ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు

అమావాస్య కారణంగా చివరి శనివారం భారీగా తగ్గిన భక్తుల రద్దీ

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శనివారం భక్తుల సంఖ్య భారీగా తగ్గింది. ఇందుకు అమావాస్యే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొని పరవశించి పోయారు. వాహనాలను పోలీసులు అద్దాల మర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే నిలిపివేశారు. దీంతో భక్తులు కాలినడకన గండికి చేరుకొని దర్శించుకున్నారు. కొందరు భక్తులు వేంపల్లె, చక్రాయపేట, నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం గండి శ్రీవాసవీ నిత్యాన్నదాన సత్రంతో పాటు పలు చోట్ల దాతలు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఛైర్మన్ కావలి కృష్ణతేజ, పాలకమండలి సభ్యులతో పాటు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేద పారాయణం రామ మోహనశర్మలు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.


ఆస్థానం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా స్వామి వారి క్షేత్రోత్సవం, ఆస్థానం

శ్రావణ మాసం ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి క్షేత్రోత్సవం, ఆస్థానం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో పూలాలంకరణ మధ్య ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఉంచి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం ఆస్థానం నిర్వహించి ఈ ఏడాది శ్రావణ మాస ఉత్సవాలను ముగించారు.

స్ఫూర్తి ప్రదాత ప్రకాశం పంతులు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత అని, భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయులని నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం పంతులు ఒకరని తెలిపారు. ఆయన పేరు మీద రాజమండ్రిలో ప్రకాశం బ్యారేజ్ నిర్మించారని, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం ప్రకాశం పంతులు అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయ వేత్తగా, రచయితగా, సంపాదకుడిగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తి తీసుకొచ్చారని కొనియాడారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్, సెట్ప్ సీఈఓ సాయి గ్రేస్, ఐసీడీఎస్ అధికారి రమాదేవి పాల్గొన్నారు.


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏ.ఆర్. అదనపు ఎస్పీ


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి

ఆంధ్ర కేసరికి ఘన నివాళి

కడప అర్బన్: ।ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శనివారం కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ.ఆర్. అదనపు ఎస్.పి. బి.రమణయ్య ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఎ.ఆర్. డీఎస్పీ శ్రీనివాస రావు, డీపీఓ ఏ.ఓ కె.వెంకటరమణ, ఆర్.ఐ లు వీరేష్, టైటస్, శివరాముడు, శ్రీశైల రెడ్డి, ఆర్.యస్.ఐ లు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

సెంచురీ పానెల్స్ పరిశ్రమను పరిశీలించిన ఆర్డీఓ

గోపవరం : సెంచురీ పానెల్స్ పరిశ్రమను ఆర్డీఓ చంద్రమోహన్ శనివారం పరిశీలించారు. తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏఓ విజయరావుతో కలిసి పరిశ్రమలో జరుగుతున్న పనులను పరిశ్రమ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం యూరియా కొరత ఉన్నందున పరిశ్రమలో ఉపయోగించే యూరియాపై ఆరా తీశారు. పరిశ్రమలో ఉపయోగించే యూరియాను కూడా స్థానిక వ్యవసాయాధికారుల ద్వారా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయానికి వాడే యూరియా కాదని నిర్ధారించారు. అనంతరం పరిశ్రమలో తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించారు.


సెంచురీ పానెల్స్ పరిశ్రమలో మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు దారుణం

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరిట తొలగిస్తుండటం దారుణమని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా విమర్శించారు. ఇది ఏమాత్రం మానవత్వం లేని ప్రభుత్వమని ధ్వజమెత్తారు. శనివారం కడపలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచానికే పరిమితమైన వారు, తలసేమియాతో బాధపడుతున్న వారు, డయాలసిస్ బాధితులు, వికలాంగులకు ఎన్నో ఏళ్లుగా పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ప్రజలకు చేసిన మేలు ఏదీ లేకపోగా పెన్షన్లు తొలగిస్తోందని విమర్శించారు. తాము రూ. 3 వేలు ఉన్న పెన్షన్ రూ. 4 వేలకు పెంచామని ఓవైపు గొప్పలు చెప్పుకుంటూ మరోవైపు కోత విధిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం నుంచి దిగిపోయే సమయానికి రాష్ట్రంలో 66,34,000 పెన్షన్లు ఉన్నాయని, బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 62,19,000కు తగ్గిపోయాయని పేర్కొన్నారు. అంటే సుమారు 4.50 లక్షల పెన్షన్లు తొలగించారని తెలిపారు. కడప అసెంబ్లీ నియోజకవర్గంలో 3,160 దివ్యాంగ పెన్షన్లు ఉండగా, ప్రస్తుతం రీ వెరిఫికేషన్ పేరిట ఆగస్టు నెలలోనే 634 మందికి తొలగిస్తూ నోటీసులు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో లక్ష పైబడి వికలాంగుల పేర్లతో దొంగ పెన్షన్లను పొందుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడటం అన్యాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత లేకున్నా మంజూరు చేసిన బోగస్ పెన్షన్లను మాత్రమే తొలగిస్తున్నామంటూ ప్రభుత్వం చెప్పడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విపరీతంగా అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకగా మారుస్తున్నారంటూ నాడు చంద్రబాబు విమర్శించారన్నారు. జగన్ హయాంలో 3 లక్షల 33 వేల కోట్లు అప్పులు తీసుకొచ్చి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. చంద్రబాబు 14 నెలలకే లక్షా 87 వేల కోట్లు అప్పులు తీసుకొచ్చినా సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని, మిగతా డబ్బులు ఎక్కడికి వెళుతున్నాయని ప్రశ్నించారు. కార్పొరేటర్ షఫీ, నాయకులు దాసరి శివ, శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్‌కుమార్, టక్కోలు రమేష్‌రెడ్డి, తోట కృష్ణ, బసవరాజు, గౌస్‌బాషా, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

ఇక అంతా స్పీడ్ పోస్టే!

- పోస్టల్ శాఖలో సెప్టెంబర్ ఒకటి నుంచి రిజిస్టర్ పోస్టు రద్దు
- ట్రాకింగ్ సిస్టంతో విస్తృత సేవలు



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దశాబ్దాలుగా పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ రద్దవుతోంది. ఈ నెలాఖరుకు రిజిస్టర్డ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖ నుంచి అంతర్ధానం కానుంది. రిజిస్టర్డ్ పోస్టును స్పీడు పోస్టులో విలీనం చేయడం ద్వారా ఈ విధానం రద్దు కానుంది. కొత్త విధానం సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ అమలులోకి తీసుకురానుంది. ఇకనుంచి స్పీడ్ పోస్ట్ పార్సిల్ సేవలు అందించనున్నాయి. స్పీడ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖలో విస్తృత సేవలు అందిస్తోంది. కొత్తగా స్పీడ్ పోస్ట్‌లో ట్రాకింగ్ సిస్టం కూడా అందుబాటులోకి వచ్చింది. పార్సెల్ బుక్ చేసిన వ్యక్తికే కాకుండా దానిని అందుకోనున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు పూర్తి సమాచారంతో కూడిన మెసేజ్ వస్తుంది. బుక్ పార్సిల్ ఎక్కడుంది. ఎప్పటికి అందుతుంది వంటి వివరాలు మొబైల్ ఫోన్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించింది.

సరికొత్త టెక్నాలజీ దిశగా..

పోస్టల్ శాఖ ఇప్పటి వరకు అమలవుతున్న టెక్నాలజీ విధానాలకు స్వస్తి పలికి సరికొత్త సాంకేతిక ఆధునికతతో కూడిన ఏపీటీ 2.0 ద్వారా సేవలందిస్తోంది. జులై నెలకు ముందు పోస్టల్ శాఖ మొత్తం సేవలు కోర్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా అందేవి. వీటినే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్న ఏపిటీ 2.0 అమలులోకి తెచ్చింది. కడప డివిజన్ పోస్టల్ కార్యాలయంలో పోస్టల్ సేవలను ఏపీటి 2.0 అందించడమే కాదు వచ్చే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విలీనమైన స్పీడ్ పోస్ట్ ద్వారా సాంకేతిక సౌకర్యాలతో సేవలందించేందుకు డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. కడప డివిజన్ పోస్టల్ కార్యాలయంలో 2 ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. 54 సబ్ పోస్టాఫీసులు, 395 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో స్పీడ్ పోస్ట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.